క్లుప్తంగా

ప్రతి చెట్టుకు ప్రశంసాపత్రం



మొక్కలు నాటిన బెస్సీకి కేంద్ర ప్రభుత్వం అందజేసిన ప్రశంసాపత్రం

గుర్రంపోడు : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. 'ఏక్ పేడ్ మాకే నామ్' అనే కార్యక్రమం ద్వారా ప్రతి విద్యార్థి తన తల్లితో కలిసి మొక్క నాటి ఏకో క్లబ్ మిషన్ లైఫ్ అనే పోర్టల్‌లో ఫొటోను అప్‌లోడ్ చేస్తే.. వారి పేరిట ఆన్‌లైన్‌లోనే క్షణాల్లో ప్రశంసాపత్రం లభిస్తుంది. నాటిన ప్రతి మొక్కకు ప్రశంసాపత్రం వస్తుంది. ఈ వెబ్ పోర్టల్‌కు సంబంధించి లింక్‌ను విద్యాశాఖ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు తెలియజేసింది. వ్యవసాయ పనుల సమయం కావడంతో విద్యార్థి పాఠశాలకు వచ్చేటప్పుడే తన తల్లిని తీసుకొచ్చి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్నారు. మండలంలో విద్యార్థులంతా తల్లితో కలిసి మొక్కలు నాటించే కార్యక్రమం చురుకుగా సాగుతుందని మండల విద్యాధికారి నోముల యాదగిరి తెలిపారు. కొప్పోలు జడ్పీ ఉన్నత పాఠశాలలోనే వంద మందికి పైగా విద్యార్థులు మొక్కలు నాటి ప్రశంసాపత్రాలు పొందారని తెలిపారు.

ఎల్‌ఓసీ అందజేత

గుర్రంపోడు : మండలంలోని తెరాటిగూడెం గ్రామానికి చెందిన జక్కల మోహనయ్య అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఆయన చికిత్సకు అవసరమైన డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న విషయం స్థానిక నాయకులు ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించి సీఎం సహాయ నిధి ద్వారా రూ. 2లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. శుక్రవారం ఆ ఎల్‌ఓసీని తన క్యాంపు కార్యాలయంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్సీతో పాటు వెంకటయ్య, భాస్కర్‌లు ఉన్నారు.

గిడుగు రామ్మూర్తికి నివాళి



రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని కేఎస్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆధునిక తెలుగు భాష, సాహిత్యానికి వైతాళికుడైన గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ మలిగిరెడ్డి భీమార్జున్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శివ కృష్ణలు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, నాగరాజులతో పాటు అధ్యాయపకులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

మిర్యాలగూడ టౌన్ : జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై ప్రజల్లో మరింత అవగాహన తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మెప్మా విభాగం సిబ్బంది, ఆర్‌పీలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ఈ సమావేశంలో మెప్మా టీఎంసీ పాతేపాక బక్కయ్య ఉన్నారు.

స్కావెంజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గుర్రంపోడు : మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రెండు స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు మండల విద్యాధికారి నోముల యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగి కనీసం ఏడో తరగతి చదివిన 18నుంచి 45ఏళ్ల లోపు మహిళలు తమ దరఖాస్తులను కేజీబీవీలో సెప్టెంబర్ 5వ తేదీ లోగా అందజేయాలని కోరారు. రూ 9750 వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. త్రిసభ్య కమిటీ ఆమోదం మేరకు నియామకం చేయనున్నట్లు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం

నిడమనూరు : వర్షాలతో రోడ్డంతా బురదమయంగా మారిందని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను ఆరోపించారు. మండలంలోని రేగులగడ్డలో సీపీఎం నాయకులు రోడ్డుపై నాట్లేసి నిరసన తెలిపారు. రేగులగడ్డ గ్రామంలో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను, కార్యదర్శి కోటేష్ మాట్లాడారు. గ్రామాల్లో సీసీ రహదారులు, సీసీ డ్రెయినేజీల నిర్మాణం చేపట్టడంలో విఫలం చెందిందన్నారు. ప్రత్యేకాధికారుల పాలన పంచాయతీల్లో తాగునీరు, వీధి దిపాలు వెలగని పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నల్లబోతు సోమయ్య, జగతి, బలరాం, శ్రీలక్ష్మి, ఏడుకొండలు, ముత్తయ్య, కొండలు ఉన్నారు.

మాయమవుతున్న మట్టిదిబ్బలు

- ఏఎమ్మార్పీ కాల్వ మట్టి అక్రమంగా తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- చోద్యం చూస్తున్న అధికారులు



ఏఎమ్మార్పీ ప్రధానకాల్వ వెంట చామలోనిబావి వద్ద మట్టిదిబ్బల తరలింపుతో ఏర్పడిన గుంతలు

గుర్రంపోడు : ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ వెంట మట్టిదిబ్బలు మాయమవుతున్నాయి. ఏళ్ల తరబడి యథేచ్ఛగా మట్టిని అక్రమంగా తరలించడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతుంది. నిబంధనల ప్రకారం మట్టి కోసం మైనింగ్ శాఖకు దరఖాస్తు చేసుకుంటే ఆ శాఖ నుంచి నీటిపారుదల శాఖ ద్వారా మట్టి లభ్యతను గుర్తించి అక్షాంశ, రేఖాంశాల ప్రకారం ఎంత క్యూబిక్ మీటర్ల అవసరమైతే ఆ మేరకు ప్రదేశాన్ని గుర్తించాల్సి ఉంటుంది. ఆ తర్వాత సినరేజీ పన్ను క్రింద క్యూబిక్ మీటరు నిర్ణీత రుసుం లెక్కన పన్ను చెల్లించి అనుమతి పొందాలి. ప్రభుత్వ అవసరాలకైనా కంట్రాక్టరు అనుమతి పొందాల్సిందే. ఏఎమ్మార్పీ ప్రధానకాల్వ వంద కిలోమీటర్ల పోడవునా ఏళ్ల తరబడి ఇవేవీ లేకుండా ఎవరికిష్టం వచ్చినట్లు వారు మట్టిని తరలిస్తున్నారు. ప్రధాన కాల్వ తవ్వకంలో అప్పట్లో డీప్ కట్ జరిగిన చోట్ల 20 మీటర్ల ఎత్తు వరకు మట్టి దిబ్బలు కూడా అక్కడక్కడా ఉన్నాయి. 30 ఏళ్లుగా మట్టిని యథేచ్ఛగా తరలిస్తుండటంతో చాలా వరకు మట్టి దిబ్బలు మాయమయ్యాయి. ఎక్స్‌కావేటర్లు(జేసీబీ, ప్రొక్లైనర్లు) టిప్పర్ల ద్వారా భారీ మట్టి తరలింపు జరుగుతున్నా అధికారులు చోద్యంగా చూస్తున్నారు. ఇటీవల కాలంలో ఒక్కరు మాత్రమే అనుమతి తీసుకున్నారని గుర్రంపోడు డివిజన్ అధికారులు పేర్కొంటున్నారు.

ఆక్రమణలో భూములు

ప్రధాన కాల్వ వెంట ముందుగా మట్టి తరలించి ఆ తర్వాత ఆక్రమణలకు పాల్పడుతున్నారు. దీంతో ప్రధాన కాల్వ వెంట దారి మినహా మట్టి పోసేందుకు అప్పట్లో ప్రభుత్వం భూసేకరణ జరిపిన భూమి రికార్డులకు మాత్రమే పరిమితమైంది. ఏఎమ్మార్పీ ప్రాజెక్టులో వంద కిలోమీటర్ల ప్రధాన కాల్వలో గుర్రంపోడు డివిజన్ పరిధిలోనే ప్రధాన కాల్వ 37 కిలోమీటరు నుంచి 82 కిలోమీటరు వరకు 45 కిలోమీటర్ల ప్రధాన కాల్వ ఇక్కడే అధికంగా ఉంది. డివిజన్ పరిధిలో 2500 ఎకరాల మేరకు భూసేకరణ జరుగగా ప్రధానకాల్వ, మేజర్‌కాల్వల వెంట దాదాపుగా 300 ఎకరాల మేరకు ఆక్రమణలోనే ఉందని, వీటి లెక్క అధికారులకు తెలియడం లేదని తెలుస్తుంది.

వాహనాలు సీజ్ చేస్తాం

ఏఎమ్మార్పీ కాల్వల వెంట మట్టిని రాత్రి వేళ ప్రొక్లెయినర్లు, టిప్పర్ల ద్వారా తరలిస్తున్నట్లు సమాచారం ఉంది. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ నిఘా ఉంచి అనుమతి లేకుండా తరలిస్తే ఆ వాహనాలు సీజ్ చేస్తాం. మట్టిని తొలగించి తాత్కాలికంగా భూమిని తమ భూమిలో పక్క రైతులు కలిపేసుకొని ఆక్రమించుకున్నా తమది కాని భూములపై వారికి ఎలాంటి హక్కులు ఉండవు. భూభారతి ద్వారా పక్కాగా లెక్కలు తీసి ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంటుంది.

– నెహ్రూనాయక్, డీఈఈ

ప్రజా సమస్యల పరిష్కారానికే జనహితం

- ఎమ్మెల్యే బాలునాయక్



డిండి మండల కేంద్రంలో మత్స్యకారుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలూనాయక్

డిండి : గ్రామాల్లోని పేద జనం ఎదుర్కొంటున్న సమస్యలు నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికే జనహితం పేరుతో మార్నింగ్ వాక్ విత్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బాలూనాయక్ అన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో ఆయన సంబంధితాధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో కలిసి డిండి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ, ముదిరాజ్ కాలనీ, దర్గా వీధి, అంగడి బజార్, చెన్నకేశవ ఆలయం వీధి, మార్కండేయ టెంపుల్ బజార్, ఆర్‌టీసీ బస్టాండు సమీపంలోని వీధుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పేద ప్రజలతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలు గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్లు రాలేదని, డ్రెయినేజీ సమస్య, తాగునీటి సమస్యతో పాటు 15ఏళ్ల క్రితం ఇరిగేషన్ శాఖ పేరు మీదకు మారిన మండల రైతులకు చెందిన దాదాపు 450 ఎకరాల పొలాలకు తిరిగి పట్టాలు ఇప్పించాలని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఇరిగేషన్ భూముల విషయంపై కొనసాగుతున్న అప్డేట్, ధనకుంట శిఖంపై విచారణ సర్వే రిపోర్టు తమకు వెంటనే అందించాలని రైతుల సమక్షంలో అక్కడే ఉన్న ఆర్డీఓ రమణారెడ్డిని ఆయన ఆదేశించారు. అనంతరం రూ.12 లక్షలు ఖర్చు చేసి నిర్మించే అంగన్‌వాడీ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, డీఎల్‌పీఓ శంకర్ నాయక్, ఇరిగేషన్ ఈఈ ఎలమందయ్య, పీఆర్ ఏఈ విజయ్‌కుమార్, ఎంపీడీఓ వెంకన్న, గ్రామ కార్యదర్శి జంగయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, మండలాధ్యక్షుడు రాజేష్‌రెడ్డి, యూత్ మండలాధ్యక్షుడు సాయి, కాశన్న, వెంకటేష్, శ్రీనివాస్‌గౌడ్, సలయ్య, భీముడు, ఖలీం, వెంకటేష్‌గౌడ్, బుచ్చిరెడ్డి, శైలేష్, విజయేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తిచేయాలి



నాగార్జునసాగర్ : నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్, డీఎస్పీ తదితరులు

మిర్యాలగూడ : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులు వినాయక నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. శుక్రవారం దామరచర్ల మండలంలోని వాడపల్లి, వేములపల్లి, అనుముల, పెద్దవూర మండలాల్లో ఏర్పాటు చేసిన అన్ని గణేష్ నిమజ్జ కేంద్రాలను ఆయన డీఎస్పీ రాజశేఖర్‌రాజుతో కలిసి పరిశీలించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

హాలియా : అలీనగర్ (14వ మైల్) సమీపంలో ఉన్న సాగర్ ఎడమ కాల్వ బ్రిడ్జి వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు అధికారులను ఆదేశించారు. అలీనగర్ (14వ మైలు రాయి) వద్ద నిర్వహించే గణేశ్ విగ్రహాల నిమజ్జన ప్రదేశాన్ని శుక్రవారం వారు పరిశీలించి మాట్లాడారు. అధికారులు సమన్వయంతో పనిచేసి నిమజ్జన ఉత్సవాలను శాంతియుతంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వారి వెంట సీఐ సతీష్‌రెడ్డి, ఎంపీడీఓ సుజాత, ఎస్‌ఐ సాయి ప్రశాంత్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ : వినాయక విగ్రహాల నిమజ్జనాలు చేసేందుకు గాను నాగార్జునసాగర్‌లో అధికారులు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. పెద్దవూర–సాగర్, హాలియా–సాగర్ మూడురోడ్ల కూడలి(సమ్మక్క–సారలమ్మ)కి సమీపంలోని దయ్యాలగండి పుష్కరఘాట్ వినాయకులను నిమజ్జనం చేసేందుకు సరైన ప్రాంతంగా గుర్తించారు. సాగర్‌లోకి రాకుండానే దయ్యాలగండి పుష్కరఘాట్ వద్ద వినాయకులను నిమజ్జనం చేయవచ్చని నిర్ణయించారు. మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణఅమిత్, డీఎస్పీ రాజశేఖరరాజు, సీఐ శ్రీనునాయక్, డాక్టర్ నగేష్, పెద్దవూర తహసీల్దార్ రఘు, ఎస్‌ఐ ముత్తయ్య, ఆర్‌ఐ దండశ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



క్రీడాజ్యోతి వెలిగించి ర్యాలీ ప్రారంభిస్తున్న ఏఎస్పీ మౌనిక, ఎన్‌వీటీ



నాగార్జునసాగర్ : ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

దేవరకొండ : హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్‌ను క్రీడాకారులు ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో రాణించాలని దేవరకొండ ఏఎస్పీ మౌనిక అన్నారు. శుక్రవారం దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్ 121వ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలని ఆమె ఆకాంక్షించారు. క్రీడాకారులకు స్పోర్ట్స్ అసోసియేషన్ అందిస్తున్న చేయూతను ఆమె అభినందించారు. అంతకు ముందు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమైన క్రీడా ర్యాలీని క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, సీఐ వెంకట్‌రెడ్డి, ముత్యాల సర్వయ్య, కొండ్ర శ్రీశైలంయాదవ్, తాళ్ల శ్రీధర్‌గౌడ్, కృష్ణకిషోర్, సన్నీ, రవి, ఏడుకొండల్, ఆంజనేయులు, చైతన్య, బత్తుల అమర్, ఉమామహేష్, గోపి, నరేష్, అసోసియేషన్ సభ్యులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీసీగురుకుల విద్యాలయంలో..

నాగార్జునసాగర్ : మహాత్మాజ్యోతి బాపూలే నాగార్జునసాగర్ బీసీ గురుకులంలోని డిగ్రీ కళాశాలలో, పాఠశాలలో వేర్వేరుగా క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని జాతీయక్రీడాదినోత్సవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం కళాశాల,పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఆయన క్రీడలకు చేసిన సేవలను కొనియాడారు.

దూర విద్యను మరింత విస్తృతం చేస్తాం

మిర్యాలగూడ టౌన్ : బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం సేవలను మరింత విస్తృతం చేస్తామని ఆ యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి. ధర్మానాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కేఎస్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓపెన్ డిగ్రీ అధ్యాయన కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం అధ్యాయన కేంద్ర కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలోనే నకిరేకల్, హాలియా కేంద్రాల్లో నూతనంగా అధ్యాయన కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కేఎస్‌ఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మలిగిరెడ్డి భీమార్జున్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్టార్ రెడ్యానాయక్, స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ పి. నాగరాజు, వైస్ ప్రిన్సిపల్ వెంకటరమణ, జాక్ట్రో వెంకన్న, రవీందర్, కౌన్సిలర్లు పాష పాల్గొన్నారు.

బాలాజీ సేవలు భవిష్యత్ తరాలకు ఆదర్శం

పెద్దవూర : విద్యాభివృద్ధికి బాలాజీ చేసిన సేవలు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని మండల విద్యాధికారి తరి రాములు అన్నారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలంలోని చలకుర్తి ప్రాథమిక పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం బాలాజీ ఉద్యోగ పదవీ విరమణ సన్మానోత్సవ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఈ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి బాలాజీ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కె.శ్రీనివాస్, ఇరుమాది పాపిరెడ్డి, దుర్గాప్రసాద్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వడ్లపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, దండ వీరారెడ్డి, ఎంఎన్‌ఓ శేషు, జీహెచ్‌ఎంలు ఉన్నారు.

యూరియా కోసం రైతుల ఆందోళన



కొండమల్లేపల్లి : యూరియా కోసం రాస్తారోకో చేస్తున్న రైతులు, బీఆర్‌ఎస్ నేతలు

దేవరకొండ : రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.మైనొద్దీన్ అన్నారు. శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి, పల్లా రంగారెడ్డి, వెంకటయ్య, పాండురంగారెడ్డి, నూనె రామస్వామి, వెంకట్రాములు, వెంగళయ్య, యాదయ్య, కృష్ణారెడ్డి, గోవర్ధన్, మహేష్, మల్లేష్ పాల్గొన్నారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

కొండమల్లేపల్లి : పట్టణ కేంద్రంలో యూరియా కోసం రైతులు రోడ్డెక్కారు. శశుక్రవారం పీఏసీఎస్ ఎదుట తెల్లవారుజామున యూరియా కోసం మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి రైతన్నలు క్యూ లైన్‌లో వేచి ఉన్నారు. అందులో భాగంగా శుక్రవారం రోజు కొండమల్లేపల్లి బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దస్రూనాయక్ యువజన విభాగం అధ్యక్షుడు తులసిరాం రైతులతో కలిసి 167వ జాతీయ రహదారిపై ఉదయం బైఠాయించి ధర్నా చేశారు. రైతుల ధర్నాతో సుమారు ఒక కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోవడంతో విషయాన్ని తెలుసుకున్న ఎస్‌ఐ అజ్మీరా రమేష్ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి ధర్నా విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు కొత్తబావి మాజీ సర్పంచ్ జబ్బు యాదయ్య, రైతులు పాల్గొన్నారు.



దేవరకొండ : ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

మిర్యాలగూడ : రాష్ట్రంలోని రైతులకు సరిపడా యూరియాను వెంటనే అందించాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం దామరచర్ల తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్‌కుమార్, ధనావత్ శాంత, గజ్జల లక్ష్మీనరసింహారెడ్డి, శారద, పోలేపల్లి రాజేష్, వెంకట్‌రెడ్డి, సోమయ్య, రాములు పాల్గొన్నారు.

పెద్దవూర పీఏసీఎస్‌లో డీసీఓ విచారణ



పెద్దవూర పీఏసీఎస్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీసీఓ పాత్యానాయక్

పెద్దవూర: యూరియా పంపిణీలో అక్రమాలు జరిగాయన్న అభియోగంపై శుక్రవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో సహకార సంఘం జిల్లా అధికారి(డీసీఓ) పాత్యానాయక్ విచారణ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. గత వేసవికాలంలో పీఏసీఎస్‌కు ఎన్ని బస్తాల యూరియా వచ్చిందని, ఎవరికి విక్రయించారో వివరాలను ఇవ్వాలని సీఈఓను ఆదేశించారు. దీంతో యూరియా విక్రయించిన 51మంది రైతులకు 742 బస్తాల యూరియాను విక్రయించినట్లుగా వివరాలతో కూడిన జాబితాను డీసీఓకు అందించారు. జాబితాలోని రైతులలో ఒకరి ఫోన్ నంబర్‌కు డీసీఓ ఫోన్ చేసి ఎన్ని బస్తాల యూరియాను కొనుగోలు చేశావని అడుగగా తనకు యూరియా అవసరమే లేదని తాను బస్తా కూడా కొనుగోలు చేయలేదని రైతు చెప్పినట్లు తెలిసింది. దీంతో సంబంధిత అధికారిపై డీసీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క రైతుకు ఫోన్ చేస్తేనే నిజస్వరూపం బయటపడిందని అసలు ఏమి జరిగిందని నిలదీసినట్లు తెలిసింది. దీంతో సంబంధిత సీఈఓ వ్యవసాయ పనులు అయిపోయాక రెండు లారీలలో 742 బస్తాల యూరియా వచ్చినట్లు అందులో 232 బస్తాలు రైతులకు విక్రయించినట్లు పేర్కొన్నారు. వీనిలో మిగిలిన 510 బస్తాల యూరియా గోదాముకు సరైన కిటికీలు లేకపోవడంతో గడ్డలు కట్టాయని ఆయనకు తెలిపినట్లు తెలిసింది. దీంతో యూరియా పనికిరాకుండా పోతుందని మండల కేంద్రంలోనే ఒక ఫర్టిలైజర్ దుకాణదారుడికి విక్రయించినట్లు నిజం ఒప్పుకున్నట్లు తెలిసింది. ఇలా విక్రయిస్తారని ఆగ్రహం వ్యక్తం చేసిన డీసీఓ సంబంధిత సీఈఓకు షోకాజు నోటీసు జారీ చేసినట్లు తెలిసింది. రైతులు ఎందుకు రాస్తారోకోలు చేస్తున్నారని పీఏసీఎస్ ఎంత యూరియా వచ్చిందని ప్రశ్నించారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో శని, సోమ, మంగళ, గురు వారాలలో రోజుకొకటి చొప్పున నాలుగు లారీల్లో 1766 యూరియా బస్తాలు రాగా 776 మంది రైతులకు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయ్, మహమూద్, స్థానిక సిబ్బంది ఉన్నారు.

ప్రణాళిక లేకనే యూరియా కొరత



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ: కేంద్ర ప్రభుత్వ వివక్ష, రాష్ట్ర ప్రభుత్వ ముందస్తు వ్యవసాయ ప్రణాళిక లేకపోవడం వల్ల రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 15లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా కేంద్ర ప్రభుత్వం కేవలం 9.8లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే కేటాయించిందని, ఇందులో ఇప్పటి వరకు కేవలం 5లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందించారన్నారు. కేంద్ర ప్రభుత్వానికి రాజకీయ ప్రయోజనాలే తప్ప దేశ ప్రజల అభివృద్ధి లేదని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వాలు లేని రాష్ట్రాల్లో రాజకీయ కక్షతోనే పట్టించుకోవడం లేదన్నారు. ముందుగానే బఫర్ స్టాక్ నిల్వ చేసుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అలా చేసుకోకపోవడం వల్ల ఇప్పుడు యూరియా కొరత ఏర్పడిందని, దీని వల్ల రైతులు క్యూలైన్‌లో రోజుల తరబడి నిలబడి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో బత్తాయి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, రోజురోజుకు బత్తాయి పంట సాగు తగ్గిపోతుందన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, రెమిడాల పరుశురాములు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదును పకడ్బందీగా చేపట్టాలి

పెద్దఅడిశర్లపల్లి : పంటల నమోదును పకడ్బందీగా చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రావణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పెద్ద అడిశర్లపల్లి మండలంలోని ఘనపురం, గుడిపల్లి గ్రామాల్లో జరుగుతున్న డిజిటల్ క్రాఫ్ బుకింగ్ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల నమోదు ద్వారా పంట వివరాలు తెలిసి పంట అమ్మకంలో ఇబ్బందులను తలెత్తవన్నారు. ఈ సందర్భంగా రైతులు తమకు యూరియా సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి యూరియా త్వరితగతిన సరఫరా అయ్యేలా చూస్తానన్నారు. ఆయన వెంట ఏఓ పాండు, ఏఈఓ సర్దార్, రైతులు శ్రీనివాస్‌రావు, భద్రయ్య, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.



పంటల నమోదును పరిశీలిస్తున్న డీఏఓ

కొనసాగుతున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలు



మిర్యాలగూడ : 40వ వార్డులో గణేష్ మండపం వద్ద పూజల్లో పాల్గొన్న ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, తదితరులు



హాలియా : సాయిప్రతాప్ నగర్‌లో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

మిర్యాలగూడ : ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి అన్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని 40, 26వ వార్డులో నెలకొల్పిన గణేష్ మండపాల వద్ద ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వెంకన్న, రామలింగయ్యయాదవ్, షేక్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

హాలియా : మున్సిపాలిటీ పరిధిలోని సాయిప్రతాప్ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద శుక్రవారం మహిళలు, సామూహిక కుంకుమార్చన పూజ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మల్‌రెడ్డి బానుచందర్‌రెడ్డి, చారి, హరి, సురేష్, సాయి, మహిళ భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, కోటిరెడ్డిలు

మిర్యాలగూడ : దామరచర్ల మండలం వాడపల్లి గ్రామంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు కెతావత్ శంకర్‌నాయక్, ఎంసీ.కోటిరెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌లు పాల్గొని స్వామివారిని దర్శించుకొని కల్యాణోత్సవాన్ని తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని కలిగి ఉండాలన్నారు. స్వామివారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు భక్తులు పాల్గొన్నారు.